నత్తనడకన పూడికతీత

- మూడు నెలలు గడుస్తున్నా పూర్తి కాని పనులు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

అల్లవరం: దాళ్వా సీజన్‌లో ఎద్దడి లేకుండా శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందేలా కాలువల్లో పూడిక తీత పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఖరీఫ్ – దాళ్వా సీజన్‌కు ఉన్న మధ్య కాలంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించేందుకు చదరపు మీటరు ఒక్కొంటికి రూ.9 చొప్పున రూ.17 లక్షలు కేటాయించింది. మేజర్, మైనర్ కాలువల్లో పూర్తి స్థాయిలో చెత్త చెదారాన్ని తొలగించేలా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ పనులు కూలీలతో నిర్వహించవలసి ఉండగా కాంట్రాక్టర్ మాత్రం జేసీబీతో చేయిస్తున్నారు. కాలువకి ఒకవైపు మాత్రమే చెత్త తొలగిస్తూ రెండో వైపున వదిలేస్తున్నారు. ప్రధాన కాలువలు వెడల్పుగా ఉండడంతో చెత్త తొలగింపు జేసీబీకి సాధ్యం కావడం లేదు. నవంబర్ నెలలో ప్రారంభమైన గుర్రపు డెక్క, చెత్తా చెదారం తొలగింపు పనులు నేటికీ పూర్తి చేయలేకపోయారు. అల్లవరం మండలంలో రెండు ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలు 22 వరకు ఉన్నాయి. వీటిలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించి రైతులకు సాగు నీటి ఎద్దడి లేకుండా చూడవలస్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులపై ఉంది. గోపాయిలంక అక్విడెక్టు నుంచి తుమ్మలపల్లి ఓఎన్‌జీసీ పంపు హౌస్ వరకు విస్తరించి ఉన్న కౌశిక కాలువలో భారీగా గుర్రపు డెక్క పేరుకుపోయి శివారు ప్రాంతాలకు సాగునీరు పూర్తి స్థాయిలో వెళ్లడం లేదు. బెండాకాలువ–4 కి నేటికి సాగునీరు వెళ్లలేదు. కౌశిక కాలువలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగిస్తే బెండాకాలువ–2, 4, లకు సాగునీరు అందించడానికి ఆస్కారం ఉంది. బెండాకాలువ–4 పరిధిలో సాగునీరు వెళ్లక సుమారు 70 ఎకరాల్లో వరి నాట్లు వేయలేదు. బోడసకుర్రు, అల్లవరం ప్రధానకాలువల్లో పూడిక తీత పనులు నిర్వహించినా కాలువల్లో చెత్త దర్శనమిస్తోంది. ఉప్పలగుప్తం మండలంలో చల్లపల్లి ప్రధాన పంటకాలువ నిండా గుర్రపు డెక్క ఉంది. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు వెళ్లడం లేదు. రబీ సీజన్‌లో రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో నిధులు కేటాయిస్తే ఇరిగేషన్ అధికారులు మాత్రం కాంట్రాక్టర్‌తో పనులు చేయించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయినా చెత్త చెదారాన్ని తొలగించేలా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


చల్లపల్లి ప్రధాన పంటకాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

కూలీలు రాక పనుల ఆలస్యం

ప్రస్తుతం బెండకాలువ–2 లో పనులు జరుగుతున్నాయి. కౌశిక చానల్, బెండాకాలువ–4 చేయవలస్సి ఉంది. కాలువల్లో మృత కోబరాలు వస్తుండడంతో కూలీలు పూడికతీత పనులకు రావడం లేదు. అందువల్ల ఆలస్యం అవుతోంది.

– రహమాన్, ఇరిగేషన్ ఏఈ, అమలాపురం


అల్లవరం ప్రధాన పంట కాలువకు ఒక వైపునే చెత్త తొలగిస్తున్న జేసీబీ

పథకాల అమలు పరిశీలనకే గడపగడపకూ

- మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాల పథకాల ద్వారా పేద వర్గాల వారికి ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో క్షేత్రస్థాయిలో తెలుసుకొనేందుకే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. మంగళవారం మంత్రి పాలగుమ్మి, చప్పిడివారి పాలెం కంభంపాడు, పెద్ద పేట గ్రామాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి ఏ మేరకు చేకూరింది, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ కార్యక్రమాలు చిట్టచివరి లబ్ధిదారుల వరకు అందుతున్నదీ లేనిది ఆరా తీశారు. తమ గృహం దెబ్బతిన్నదని రిపేర్ నిమిత్తం సహాయ అందించాలని బొంతు శ్యామల కోరగా మంత్రి స్పందించి పది బస్తాల సిమెంట్ ఉచితంగా ఇస్తానని ఆమెకు హామీ ఇచ్చారు. గ్రామంలో 50 సంవత్సరాల దివ్యాంగుడు ట్రై సైకిల్ కావాలని మంత్రిని అభ్యర్థించగా ట్రైసైకిల్ ఇప్పిస్తానని చెప్పారు. పాలగుమ్మి గ్రామస్తులు తమ గ్రామానికి ప్రధాన రహదారి నిర్మించాలని కోరగా ప్రధాన రహదారి చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. కంభంపాడు గ్రామంలో వీధులలోని విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో ఇళ్లకు కరెంటు సరఫరా కనెక్షన్ ఇవ్వడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్తంభాలు దగ్గరగా వేయాలని గ్రామస్తులు కోరగా ఏపీఈపీడీసీఎల్ అధికారుల ద్వారా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రి విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఆనందాన్ని వెలిబుచ్చుతున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం నవరత్నాల కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు మరిన్ని కార్యక్రమాలు చేపట్టి పేదవారి జీవితాల్లో వెలుగులు నింపే విధంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు పాలగుమ్మి విజయవాసు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, ఎంపీపీ కూడుపూడి భాగ్య లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీ హరిరామ్‌గోపాల్, గెడ్డం సంపదరావు, సర్పంచ్ కూడుపూడి రామలక్ష్మి, డీసీసీబీ డైరెక్టర్ యిళ్ల గోపాలకృష్ణ, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, ఏఎంసీ చైర్మన్ బొక్కా ఆదినారాయణ, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి, సర్పంచ్ దాసరి అరుణకుమారి, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొక్కా ఏడుకొండలు పాల్గొన్నారు.


వికలాంగుడి సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి విశ్వరూప్

వైభవంగా నరసన్న గజమాల యాత్ర


గజమాల యాత్రలో పాల్గొన్న అగ్నికుల క్షత్రియులు


గజమాల యాత్రను ప్రారంభిస్తున్న ధర్మారావు తదితరులు

అల్లవరం: అంతర్వేదిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి సమర్పించనున్న భారీ గజమాలకు భక్తులు అంగరంగ వైభవంగా యాత్ర నిర్వహించారు. రాజోలు తాలుకా అగ్నికులక్షత్రియ యువజన సంఘ అధ్యక్షుడు చింతా మహానాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఓడలరేవు నుంచి స్వామి వారి గజమాల యాత్ర ప్రారంభమైంది. ఓడలరేవు, అల్లవరం, పేరూరు, బోడసకుర్రు మీదుగా గజమాల యాత్ర ఘనంగా సాగింది. ఈ యాత్రలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. గజమాల యాత్ర పూర్తయ్యాక స్వామివారికి సమర్పిస్తామని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు మంగళవారం తెలిపారు. అమలాపురం తాలుకా అగ్నికులక్షత్రియ సంఘ అధ్యక్షుడు పెమ్మాడి సాయి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నాగిడి నాగేశ్వరరావు, చింతా శ్రీను, కేపీ రాజు, మల్లాడి ఉమా, తారాడి శివ, చిలకలపూడి ధర్మ పాల్గొన్నారు.

తరలివెళ్లిన యువకులు

కాట్రేనికోన: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ నిర్మాత కొప్పనాతి కృష్ణమ్మవర్మ గజమాల యాత్రకు కాట్రేనికోన మండలం నుంచి అగ్నికుల క్షత్రియులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఆలయ నిర్మాత కృష్ణమ్మ జన్మస్థలం ఓడలరేవు నుంచి అంతర్వేది వరకు గజమాల యాత్ర సాగుతుంది. బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, చిర్రయానాం, పల్లం, పోర, గచ్చకాయల పోర, నాగపట్నం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువకులు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. కాట్రేనికోన గేట్ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు పాలెపు ధర్మారావు కేక్ కట్ చేసి గజమాల యాత్రను ప్రారంభించారు. పాలెపు సత్యం, కొప్పాడి విఘ్నేశ్వరుడు, సంగాని శివకుమార్, మల్లాడి దయా పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి పంచాయితీ పరిధి రాఘవులపేటలో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైన కర్రి వెంకటేశ్వరరావు కుటుంబానికి మంగళవారం నిత్యావసర సరకులను అందజేశారు. గుడ్ సీడ్ అధినేత కుంచే రమణారావు సహకారంతో బాధితులకు మంగళవారం సరకులను అందజేశారు. కుంచే చిన్ని, పరమట రాజేష్, దోనిపాటి రాంబాబు పాల్గొన్నారు.



సరకులను అందిస్తున్న సభ్యులు

వై.జంక్షన్‌లో విస్తృత తనిఖీలు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి మద్యం అక్రమ తరలింపును నియంత్రించడంతో పాటు రహదారి ప్రమాదాలను నివారించేందుకు పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. కోరంగి ఎస్ఐ పి.శ్రీనివాసకుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ చెక్‌పోస్టులో మొబైల్ ఎస్ఐ తమ్మారావుతోపాటు పలువురు కానిస్టేబుల్స్ మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలతోపాటు భారీ వాహనాలను తనిఖీలు చేసి డ్రైవర్ల అవగాహన కల్పిస్తున్నారు.


పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

దుర్గాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం

తాళ్లరేవు: పటవల పంచాయతీ శాంతిమూల గ్రామంలో వేంచేసియున్న శ్రీ దుర్గాలమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా ఆలయ అర్చకులు లంక భవానిశంకర్‌శర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి నైవేద్యాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాట్ల గిరీష్ రాజు, దాట్ల వర్మరాజు, వి.సీతారామరాజు, పలివెల వెంకటరమణ, కొప్పిశెట్టి వెంకట్, వాసంశెట్టి గోవిందు, పి.నాగేశ్వరరావు, పోల్నాటి సింహాద్రి, వి.నరసింహరాజు, కాకర్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో దుర్గాలమ్మ

నేడు కన్యకాపరమేశ్వరికి విశేష పూజలు

యానాం: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరికి బుధవారం విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రకటనలో తెలిపింది. 17 ఏళ్ల క్రితం భీష్మ ఏకాదశి పర్వదినం రోజున ప్రతిష్ఠితమైన వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, నాదస్వరం, అభిషేకం, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారన్నారు. అనంతరం గ్రామోత్సవం, పల్లకీసేవ చేస్తారు. 108 రకాల సారెను వీధులలో ఊరేగించి అమ్మవారికి ప్రసాదంగా సమర్పిస్తారని తెలిపారు.

ఎమ్మెల్యేలకు జిరాక్స్ మెషీన్లు అందజేత

యానాం: శాసనసభ్యుల ఆఫీసుల్లో వివిధ ప్రజాఅవసరాల కోసం కావాల్సిన పత్రాల నకళ్లను తీసుకునేందుకు వీలుగా వారికి మంగళవారం సీఎం రంగసామి జిరాక్స్ మెషీన్లు అందజేశారు. పుదుచ్చేరి అసెంబ్లీలో ఉన్న మొత్తం 30 మంది ఎమ్మెల్యేలకు, ముగ్గురు నామినేటెడ్ సభ్యులకు జిరాక్స్ మెషీన్లను అందజేశారు. స్పీకర్ ఆర్.సెల్వం, మంత్రులు నమశ్శివాయం, జయకుమార్, చంద్రప్రియాంక, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఏటిగట్టుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలి

యానాం: యానాం–కనకాలపేట ఏటిగట్టు దారిలో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్లు నిర్మించాలని కోరుతూ మంగళవారం కనకాలపేట గ్రామస్తులు, యువకులు ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐ గూటం శివగణేష్, పీడబ్ల్యూడీ ఏఈ భాస్కర్‌కు వినతిపత్రాలను అందజేశారు. కోన సుబ్బారావు, సూరిబాబు, కనకాల వసంతరాయుడు, కనకాల శ్రీనివాస్, జక్కపు ఆదినారాయణ పాల్గొన్నారు.

కోలుకుంటున్న దంపతులు

యానాం: స్థానిక బైపాస్ రహదారిలో సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడిన దంపతులు దూడల సత్యసాయి గిరిధర్, వీరవెంకట విజయలక్ష్మి క్రమంగా కోలుకుంటున్నారని మంగళవారం వారి కుటుంబ సభ్యులు తెలిపారు. గిరిధర్ మెదడులో రక్తస్రావం తగ్గడంతో ఆయన పరిస్థితి యథాస్థితికి వస్తుందని భావిస్తున్నామన్నారు. కాకినాడ అపోలో ఆసుపత్రిలో అత్యవసర చికిత్సను వైద్యులు అందిస్తున్నారన్నారు.

బీజేపీ సీనియర్ నేత సత్యం మృతి

అమలాపురం రూరల్: భట్నవిల్లికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు బులుసు సత్యం (80) మంగళవారం అస్వస్థతతో మృతిచెందారు. ఈయన కొనసీమలో తొలిసారిగా ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా సేవలు అందించారు. బులుసు పార్థివ దేహానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగిల వెంకట రామారావు, నాయకులు అంజలి ఘటించారు.


సత్యం (ఫైల్)

నేడు కాలభైరవస్వామి తీర్థం


వెండి ఆభరణాల అలంకరణలో కాలభైరవుడు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ సెంటర్ ప్రాంతంలో కొలువైవున్న కాలభైరవస్వామి వారి తీర్థం బుధవారం జరుగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేసారు. ఏడు గ్రామాల ఆధ్వర్యంలో ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన నిర్వహించే స్వామివారి తీర్థ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీ గణేష్ మహాలక్ష్మి చేపల వర్తక సంఘం 6.900 కేజీల వెండితో చేయించిన ఆభరణాలకు మంగళవారం సంప్రోక్షణ నిర్వహించి స్వామివారికి అలంకరించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమలాపురం టౌన్: నేషనల్ అయోడిన్ డిఫిసెన్సీ డిజార్డర్స్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్ఐడీడీసీపీ) ఆధ్వర్యంలో అమలాపురం భూపయ్య అగ్రహారంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో అయోడిన్ లోపంపై సర్వే మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అయోడిన్ లోపంపై వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎన్ఐడీడీసీపీ స్టేట్ నోడల్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో ఈ సర్వే, వైద్య పరీక్షలు జరిగాయి. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర, అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి, ఎన్ఐడీడీసీపీ జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జాన్ లెవి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ సూర్య నగేష్ సమక్షంలో ఈ వైద్య పరీక్షలు జరిగాయి. ఎన్ఐడీడీసీపీ స్టేట్ నోడల్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ పిల్లల్లో అయోడిన్ లోపాలపై సర్వే చేసేందుకు రాష్ట్రంలోని ఏడు జిల్లాలో 30 పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తూ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. పిల్లలు అయోడిన్ ఉప్పును విధిగా వినియోగించాలని సూచించారు.

మందుల పంపిణీ

అమలాపురం రూరల్: కొన్ని రోజులుగా పందులు మృత్యువాత పడుతున్న కారణంగా సవర్పాల పాలెం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో అవసరమైన వ్యాధి నిరోధిక శక్తి మందులను పందుల పెంపకం దారులకు పంపిణీ చేశారు. కొన్నిరోజుల పాటు పంది మాంసం అమ్మకం నిలిపివెయ్యాలని నోటీసులు ఇచ్చారు.

భక్తుల విరాళాలు వెల్లడించాలి

యానాం: స్థానిక శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వర ఆలయానికి సంబంధించి భక్తుల నుంచి సేకరించిన విరాళాలు అని చెబుతున్న రూ.2కోట్ల 71లక్షల దాతల పేర్లు వెల్లడించాలని మంగళవారం బీజేపీ నాయకులు పెసల వెంకటేష్, కాదా పవన్‌ప్రసాద్, హరిప్రసాద్ ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండువందల ఏళ్ల క్రితం రెడ్డి రాజులు నిర్మించిన పురాతన వెంకన్న ఆలయం చక్కగా ఉన్నప్పటికి నిబంధనలకు విరుద్ధంగా భక్తుల మనోభావాలను కాదని అర్ధంతరంగా కూల్చేసి ఐదేళ్లు అవుతున్నా ఇప్పటికి పనులు ప్రారంభించలేదన్నారు. మళ్లీ ఇప్పుడు టీటీడీకి విరాళాల చెక్కును అందిస్తున్నామని మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు భక్తులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. గత ఏడాది టీటీడీ రూ. మూడు కోట్లు ఇచ్చిందని ప్రకటించారని అప్పుడే పనులు ఎందుకు మొదలు పెట్టలేదని వారు ప్రశ్నించారు.

పేదల వైద్యుడు కన్నుమూత

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన సీనియర్ వైద్యుడు పచ్చిగోళ్ల సత్యనారాయణమూర్తి (87) తన స్వగృహంలో అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. 1960 నుంచి 1990 వరకూ 30 ఏళ్ల పాటు డాక్టర్ సత్యనారాయణమూర్తి పట్టణంలో వైద్య సేవలు అందించారు. అప్పట్లో ఆయన పేదలకు ఉచిత వైద్యం అందించి పేదల వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. డాక్టర్ సత్యనారాయణమూర్తి మృతి పట్ల పట్టణంలోని ప్రముఖులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.


డాక్టర్ సత్యనారాయణ మూర్తి (ఫైల్)


బాధ్యతలు స్వీకరిస్తున్న కార్యవర్గ సభ్యులు

వాకర్స్ క్లబ్‌కు కార్యవర్గం

అమలాపురం టౌన్: ఆరోగ్య రక్షణకు నడకే అసలైన మార్గమని ప్రజల్లో అవగాహన కల్పిస్తామని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ నూతన కార్యవర్గం పేర్కొంది. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మంటపంలో క్లబ్‌కు ఎన్నికైన నూతన కార్యవర్గం మంగళవారం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శిగా పి.కామేశ్వరరావు, కోశాధికారిగా పి.చిన రామస్వామి ఎన్నికయ్యారు. జిల్లా వాకర్స్ గవర్నర్ పి.భాస్కరరావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ మాజీ గవర్నర్ డాక్టర్ పీఎస్ శర్మ, వాకర్స్ ప్రతినిధులు డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర ప్రసంగించారు.

48 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: స్థానిక మార్కెట్ సెంటరులో మోటారు సైకిల్‌పై మద్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిని అమలాపురం ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు మంగళవారం అరెస్ట్ చేశారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు గ్రామానికి చెందిన కోలా వెంకట రత్నం పాండిచ్చేరి యానాం నుంచి సుజుకి యాక్సిస్ మోటారు సైకిల్‌పై 48 ఎన్‌డీపీ మద్యం సీసాలు అక్రమ రవాణా చేస్తుండగా ఎస్ఈబీ నిర్వహించిన దాడిలో పట్టుబడ్డాడు. అతని నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. నిందితుడిని ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్‌కు విధించారని సీఐ శివరామరాజు తెలిపారు. ఈ దాడిలో ఎస్ఈబీ సిబ్బంది కరుణ, తాతారావు పాల్గొన్నారు.

అన్య మతస్తుల షాపులు లేకుండా చూడాలి

అమలాపురం రూరల్: అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి తీర్థ ఉత్సవాల్లో అన్య మతస్తుల షాపులు లేకుండా చూడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందించారు. అన్య మతస్తులు మత మార్పిడి కోసం కరపత్రాలు పంచడానికి ప్రయత్నం చేస్తున్నారని తెలిసిందని, అరికట్టాలని కోరారు. ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి దూరి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకట రామారావు, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొండేటి ఈశ్వర్ గౌడ్ వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

వైభవంగా కొండాలమ్మ జాతర

మామిడికుదురు: పాశర్లపూడిలో కొలువుదీరిన గ్రామదేవత శ్రీకొండాలమ్మ జాతర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, చిత్ర, విచిత్ర వేషధారణలు, భక్తుల కోలాహలం నడుమ జాతర ఆద్యంతం వైభవంగా జరిపించారు. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కళ్లు మిరుమిట్లు గొలిపే భారీ విద్యుత్ దీపాలతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారికి భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఈ జాతర మహోత్సవాలు సోమవారం వరకు ఏడు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ పేర్కొంది. ఆలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనతో జాతర ముగుస్తుందన్నారు.

ఎక్స్‌పర్ట్ కమిటీలో 'యెనుముల'కు స్థానం

మలికిపురం: ఓఎన్జీసీ, గెయిల్ నుంచి కోనసీమలో పర్యావరణ నష్ట నివారణ చర్యల కోసం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా ఎక్స్‌పర్ట్ కమిటీ వేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఓఎన్జీసీ, గెయిల్ నుంచి పర్యావరణ నష్ట నివారణ కోసం ఎన్‌జీటీలో కేసు వేసిన సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలేనికి చెందిన యెనుముల వెంకటపతిరాజును కూడా సభ్యుడిగా వేశారు. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ ఉంటారు. సభ్యులుగా వెంకటపతిరాజుతో పాటు కాకినాడ జేఎన్‌టీయూ సివిల్ ఇంజినీర్, జిల్లా ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్, జాయింట్ కలెక్టర్ (అగ్రికల్చర్), రాజమహేంద్రవరం ఓఎన్జీసీ ఈహెచ్ఎస్ విభాగం, డ్రైన్స్, ఇరిగేషన్ ఈఈలు, డీపీఓ (పంచాయతీ రాజ్), రూరల్ వాటర్ సప్లయ్ ఎస్ఈ, శానిటేషన్, పంచాయతీరాజ్ ఎస్ఈలను నియమించారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి వట్టి ఎన్నో పోరాటాలు చేశారు

అమలాపురం టౌన్: ఆంధ్రా యూనివర్శిటీలో తాము కలిసి చదువుకున్నప్పుడు మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ విద్యార్థుల స్కాలర్ షిప్పులు, హాస్టల్ వసతి తదితర సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశారని ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా స్థలంలో సూర్య వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సంతాప కార్యక్రమంలో సూర్యనారాయణరావు మాట్లాడారు. సూర్య వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గుత్తుల శ్రీనివాసరావు, చప్పిడి శోభన్‌బాబు, అడపా రామకృష్ణ, వాసంశెట్టి కరుణాకర్ పాల్గొన్నారు.

రేపు రాజేశ్వరస్వామి కల్యాణం

యానాం: స్థానిక శ్రీరాజరాజేశ్వరీ సమేత రాజేశ్వర స్వామివారి కల్యాణం గురువారం జరుగుతుందని దేవస్థానం కమిటీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. శ్రీరాజా మన్యం కనకయ్య జమీందార్ కుమారుడు ఫణికుమార్ దంపతులు కల్యాణం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతులు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ , స్నేహ దంపతులు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, సువర్ణ మంగళ సూత్రాలు సమర్పిస్తారన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం తరఫున ఆర్ఏఓ మునిస్వామి దంపతులు స్వామివారికి పట్టు పీతాంబరాలు, సువర్ణ యజ్ఞోపవీతం సమర్పిస్తారన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా అప్పలస్వామి



ఐ.పోలవరం: ఐ.పోలవరం మండలం జి.మూలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా పనిచేస్తున్న రేవు అప్పలస్వామి యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. మండపేటలో ఆదివారం జరిగిన జిల్లా నూతన కౌన్సిల్ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆయన మండల శాఖ అధ్యక్షుడిగా 20 సంవత్సరాలు పనిచేశారు.

'జోడో' కో ఆర్డినేటర్‌గా సుభాషిణి



అమలాపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ జోడో అభియాన్ యాత్ర కో ఆర్డినేటర్‌గా అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, ఏపీసీసీ మెంబర్ అయితాబత్తుల సుభాషిణి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆమెను నియమించారు.

ఘనంగా సత్తెమ్మ జాతర

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి, సన్నవిల్లి ఉమ్మడి గ్రామాల్లో వేంచేసి ఉన్న సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి విశేష పూజలు చేసి, నైవేద్యాలు చెల్లించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకర్షణీయంగా నిలిచాయి. అనంతరం అమ్మవారికి గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ గ్రామ ప్రజల సహకారంతో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసింది.

రేపటి నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం

అల్లవరం: మండలంలో ఈ నెల 2 నుంచి 4 వరకు గోడిలంక, గోడి, గోడితిప్ప గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ నిర్వహించనున్నారని ఎంపీడీఓ జి.సరోవరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు వివరించనున్నారని తెలిపారు.

మద్యం, సారా ధ్వంసం

అమలాపురం టౌన్: స్థానిక ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో మూడు నెలల్లో పట్టుబడ్డ 19 కేసులకు సంబంధించి నాటు సారా, మద్యం సీసాలను మంగళవారం అమలాపురంలో ధ్వంసం చేశారు. 65 లీటర్ల సారా, 135 మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ సీఐ వేగిశ్న శివరామరాజు తెలిపారు. వీఆర్వో, మహిళా పోలీసుల సమక్షంలో రూ.75 వేల విలువైన మద్యం, సారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. స్పెషల్ ఆఫీసర్ ఎస్ఎస్ వేణు మాధవ్, ఎస్ఈబీ ఎస్సై స్వామిరెడ్డి, వీఆర్వో సాధనాల ఏలేశ్వరరావు, మహిళా పోలీసు కృష్ణవేణి, ఎస్ఈబీ హెచ్ కానిస్టేబుల్ సీతారామరాజు, కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంకల్ప దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

అల్లవరం: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 3న గన్నవరం సమీపంలో ధర్నాస్థలి వద్ద నిర్వహించనున్న సంకల్ప దీక్ష పోస్టర్‌ని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎంటీబీఏఎస్ సుబ్బారావు మంగళవారం ఆవిష్కరించి, ప్రదర్శించారు. అల్లవరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోఈ కార్యక్రమం జరిగింది. యూటీఎఫ్ నాయకులు జి.నాగేంద్రప్రసాదు, కేఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.